
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 235 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 21-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :235 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 21-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

### ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధం

## పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై (గ్లోబల్ సప్లయ్ చైన్) తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (పీఎన్‌జీ), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థను సమీక్షిస్తూ... గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమావేశంలో, రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కూడా ఆయన వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్లతో కూడిన వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, దీని విలువ సుమారు రూ.40 కోట్లుగా ఉంటుందని తెలిపారు. అలాగే, 9 జిల్లాల్లోని 48 మండలాల్లో

తరువాయి 2లో..

## యుద్ధం అక్కడ...

## వంటగదిలో మంట ఇక్కడ!

### నిశ్శబ్దమైన సముద్ర మార్గం

### దేశాల వారీగా ఇంధన మంట

### భారత్‌లో వంటగ్యాస్ ధర పెంపు..



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఫిబ్రవరి 28న మొదలైన పశ్చిమాసియా యుద్ధం కేవలం మూడు దేశాలకే పరిమితం కాలేదు. దాని సెగ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఇంటా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రవాణాకు గుండెకాయ వంటి 'హర్మూజ్ జలసంధి'లో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో 'ఎన్డీటీవీ' తన ఎక్స్‌క్లూజివ్ కథనంలో సంచలన గణాంకాలను

తరువాయి 2లో..

## ఏపీకి వర్ష సూచన..

### దక్షిణ కోస్తాలో వడగళ్ల వాన హెచ్చరిక!



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏపీ తీరం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. ముఖ్యంగా శుక్రవారం (మార్చి 20)

తరువాయి 2లో..

## ప్రీమియం పెట్రోల్ ధర రూ.2 పెంపు

### సాధారణ, ప్రీమియం పెట్రోల్ మధ్య తేడా ఏంటి?

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రీమియం పెట్రోల్ ధర లీటర్‌కు రూ.2.35 పెరిగింది. దేశవ్యాప్తంగా వీటి ధరలను పెంచినట్లు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ప్రకటించింది. సాధారణ పెట్రోల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. అలాగే, బీపీసీఎల్ స్పీడ్, ఐవోసీఎల్ ఎక్స్‌పీ95 ప్రీమియం పెట్రోల్ ధరలకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2.09 నుంచి రూ.2.35 వరకూ పెట్రోలియం సంస్థలు ప్రీమియం పెట్రోల్ ధరను పెంచాయి. సవరించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇండస్ట్రియల్ డీజిల్ ధర లీటర్‌పై రూ.22 పెరిగింది. సాధారణ డీజిల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభా వం పడుతుండడంతో

తరువాయి 2లో..



### పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గాలంటే..

## ఫ్రాన్స్ అధ్యక్షుడితో మోదీ ఫోన్ కాల్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న వేళ.. పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ ఫోన్‌లో

తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా కీలక యుద్ధ విమానాలను కోల్పోతోంది. తాజాగా ఎఫ్-35 యుద్ధ విమానాన్ని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరంలో అత్యవసరంగా దిగాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇరాన్ ప్రకటన విడుదల చేసింది. "మా గగనతల రక్షణ వ్యవస్థ అర్ధరాత్రి దాటిన తర్వాత యూఎస్ సైన్యానికి చెందిన ఎఫ్-35 యుద్ధ విమానాన్ని దెబ్బతీసింది. అది ఏ స్థాయిలో దెబ్బతిన్నదనే దానిపై దర్యాప్తు చేస్తున్నాం. అది పూర్తిగా ధ్వంసం

తరువాయి 2లో..

## విద్యావిధానంలో మార్పులు...

### ఇక టెన్త్ పరీక్షలు ఉండవు: రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ, సిటిజన్ టైమ్స్**

ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ

తరువాయి 2లో..



## ఇప్పటికైనా చెల్లికి జగన్ న్యాయం చేస్తాడని ఆశిస్తున్నా: విజయమ్మ



**కడప, సిటిజన్ టైమ్స్**

కుటుంబ ఆస్తుల పంపకాలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో వివాదం కొనసాగుతున్న వేళ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ మీడియాకు అడ్వకేట్ నోటరీ విడుదల చేశారు. వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలపై

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# బాబు అన్నీ లెక్కలు చూస్తున్నారా...!

ఎమ్మెల్యేల విషయంలో టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విషయాలను కూలంకషంగా పరిశీలిస్తున్నారు. వాస్తవానికి నిన్న మొన్నటి వరకు ప్రజల మధ్య ఉండడం లేదన్న చర్చ నడిచింది. దీనిపై పదే పదే చంద్రబాబు హెచ్చరించారు. వారిని దారిలో పెట్టే ప్రయత్నం చేశారు. అయితే ఇప్పటికే చాలామంది ఎమ్మెల్యేలు ఎవరి దారిలో వారు నడుస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా పార్టీకి తరచుగా ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. ఈ విషయాన్ని పరిశీలించిన చంద్రబాబు తాజాగా నాలుగు అంశాలపై పార్టీ ఎమ్మెల్యేలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఒకటి ప్రజా దర్బార్ నిర్వహణ. ఈ విషయంలో అనేకమంది ఎమ్మెల్యేలు వెనకబడుతున్నారనేది పార్టీకి అందిన సమాచారం. ప్రజాదర్బార్లు అంటే వారానికి ఒకసారి.. లేదా 15 రోజులకు ఒకసారి నిర్వహించి చేతులు దులుపుకోవడం కాదన్నది పార్టీ చెబుతున్న మాట. నిరంతరం అవి కొనసాగాలని, తద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నాయకులకు తగిన అవకాశం లభిస్తుందని సమయం కూడా దక్కుతుందని చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. ఈ విషయాన్ని మరోసారి ఎమ్మెల్యేలకు గుర్తు చేశారు. ఇకనుంచి ప్రతిరోజు ప్రజాదర్బార్ నిర్వహించాలని.. ఏదైనా అత్యవసరమైన పరిస్థితి ఉంటే తప్ప ప్రజాదర్బార్ ని వదిలిపెట్టకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇక రెండోది.. మీడియా సమావేశాలు. మీడియా సమావేశాలను తరచుగా నిర్వహించాలని నాయకులకు చంద్రబాబు ఇప్పటికే సూచించారు. ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు అదేవిధంగా స్థానికంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకు మీడియా సమావేశాలు అత్యంత కీలకంగా మారతాయని కూడా ఆయన సూచించారు. అయినప్పటికీ చాలామంది ఎమ్మెల్యేలు ఇప్పటివరకు మీడియా సమావేశాలు నిర్వహించింది లేదన్నది పార్టీ దగ్గర ఉన్న సమాచారం. దాదాపు 70 నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలు ఒక్కసారి కూడా మీడియా సమావేశం నిర్వహించలేదు అని తాజాగా చంద్రబాబు చెప్పిన మాట. ఇకనుంచి అలా జరగడానికి వీలులేదని తరచుగా మీడియా సమావేశాలు నిర్వహించి కచ్చితంగా సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా చెప్పారు. మూడో విషయం సోషల్ మీడియాలో పార్టీ పరంగా వ్యవహరించాల్సిన తీరు. దీనిపై స్పష్టంగా చంద్రబాబు పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సోషల్ మీడియా ఇప్పుడు ప్రజలకు అత్యంత చేరువ అయిందని.. దీనిని వినియోగించుకుని ప్రజలకు చేరువ కావాలని ఆయన సూచించారు. అవసరమైతే రీల్స్ చేయాలని అదేవిధంగా సెల్ఫీ వీడియోలు చేసి అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు ప్రతి విమర్శలు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని ఎమ్మెల్యేలకు చెప్పారు. నాలుగో అంశం సామాజిక సేవ. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పీ4ను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని సమర్ధవంతంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు ఎమ్మెల్యేలు కూడా దోహదపడాలని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. ఈ క్రమంలో జూ4 ను అమలు చేసేందుకు నాయకులు ముందుకు రావాలని సమాజంలో ప్రజలకు సేవ చేయాలనుకునే వారిని వెతికి పట్టుకుని వారిని అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. దీనికి తగిన విధంగా కార్యక్రమాలను రూపొందించాలని మరోసారి తాజాగా ఎమ్మెల్యేలకు తేల్చి చెప్పారు. మొత్తంగా ఇలా నాలుగు అంశాలపై సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు.

# విద్యావిధానంలో మార్పులు...

నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని మున్ముందు అమలుచేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు. అటు, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని, ఇక పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఏవని విపక్షాలు ప్రశ్నిస్తుండటంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

# ప్రీమియం పెట్రోల్ ధర రూ.2 పెంపు

ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఏంటీ ప్రీమియం పెట్రోల్?**

ప్రస్తుతం దేశంలో మూడు రకాలుగా పెట్రోల్ లభిస్తోంది. ఒకటి సాధారణ పెట్రోల్, మరొకటి ప్రీమియం. ఇది కాకుండా హై ఆక్టేన్ ప్రీమియం అనే మూడో రకం పెట్రోల్ కూడా ఉంది. మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుత ధరల పెంపు హై-ఆక్టేన్, ప్రీమియం పెట్రోల్ వాడే వినియోగదారులను ప్రభావితం చేస్తుంది. బీపీసీఎల్ స్పీడ్, హెచ్‌పీసీఎల్ పవర్, ఐఓసీఎల్ ఎక్స్‌పీ95 పేర్లతో ఈ ప్రీమియం పెట్రోల్‌ను విక్రయిస్తాయి.

**సాధారణ, ప్రీమియం పెట్రోల్ మధ్య తేడా ఏంటి?**

పెట్రోల్ గ్రేడ్‌ను దాని ఆక్టేన్ విలువ ఆధారంగా వర్గీకరిస్తారు. భారత్‌లో సాధారణ పెట్రోల్ ఆక్టేన్ విలువ 87 కాగా, అదే ప్రీమియం పెట్రోల్ ఆక్టేన్ విలువ 91గా ఉంది. హై ఆక్టేన్ కలిగిన ఇంధనం ఎక్కువ కంప్రెషన్ రేషియోని కలిగి ఉంటుంది. దీని ఫలితంగా, వాహనం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో ఎక్కువ ఇంధనం తీసుకోదు. అంతేకాదు కార్బన్‌పై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. శక్తిమంతమైన ఇంజిన్లు కలిగిన స్పోర్ట్స్ కార్లు, బైక్?లు, సూపర్ కార్లు, మొదలైన వాటికి ఈ ప్రీమియం పెట్రోల్ ఉత్తమంగా నిపుణులు చెబుతారు.

# పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ, నారింజ వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. ఈ నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా రూ.62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు నివేదించారు.

**తిరుపతి నేతలకు బాబు వార్నింగ్ ..!**

తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులతో తాజాగా టిడిపి అధినేత చంద్రబాబు సమావేశం అయ్యారు. నాలుగు గోడల మధ్య జరిగిన ఈ సమావేశంలో కొంతమంది నాయకులకు ఆయన సీరియస్ గానే కొన్ని విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్న వాదన కొన్నాళ్లుగా వినిపిస్తున్న నేపథ్యంలో ఇటువంటి పాలిటిక్స్ కి దూరంగా ఉండాలని చంద్రబాబు తేల్చి చెప్పినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దూకుడు, లేకపోతే లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్న వాదన వినిపిస్తున్న మూడు నియోజకవర్గాల్లో పరిస్థితులపై ఆయన సమీక్షించారు. వారి వారి గ్రాఫ్ ను కూడా ఆయన వివరించారు. అంతేకాదు ప్రజల మధ్య ఉండని నాయకులను పక్కన పెడతానని కూడా హెచ్చరించారు. ప్రధానంగా సుదీర్ఘకాలంగా ఎదురుచూసిన ఒక కీలక నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టిడిపి తరఫున సీనియర్ నాయకుడు విజయం సాధించారు. అయితే ఎమ్మెల్యేగా ఆయన ఉన్నప్పటికీ ఆయన సతీమణి ఆ నియోజకవర్గంలో చక్రం తిప్పడం పట్ల సొంత పార్టీలోనే విమర్శలు వచ్చాయి. ప్రధానంగా పార్టీ నాయకులను దూరం పెట్టి వ్యాపారాలు వ్యవహారాలు సాగిస్తున్నారని ఆమెపై వస్తున్న ప్రధాన విమర్శ. అదే విధంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఎవరికి వారుగా నాయకులు వ్యవహరిస్తున్న తీరుపట్ల చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. ఎవరు గెలిచారు అన్నది కాదు.. కూటమి తరపున అందరు కలిసి పనిచేయాలని ఆయన పదేపదే సూచిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో కొంతమంది నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాలను ప్రామాణికంగా తీసుకున్న ఆయన వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. అంతేకాదు ఎక్కడా ప్రత్యర్థులతో లాలూచీ పడద్దని.. వారితో కలిసి వ్యాపారాలు వ్యవహారాలకు దూరంగా ఉండాలని కొంత కఠినంగానే చెప్పినట్టు తెలిసింది. సత్యవేడు నియోజకవర్గంలో ఇన్చార్జిగా ఉన్న శంకర్రావు ప్రస్తుతం దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇది పార్టీకి నష్టం కలిగించకుండా చూసుకోవాలని ఆయనకు సూచించారు. అదేవిధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలను ప్రధానంగా ప్రస్తావించిన చంద్రబాబు కుటుంబ సభ్యులను పక్కనపెట్టి ప్రజల మధ్యకు వెళ్లాలని ఆయన తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఆయన నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులు వ్యవహరిస్తున్న తీరు పట్ల వస్తున్న ఫిర్యాదులు అదేవిధంగా పార్టీ రూపొందించిన నివేదికలను కూడా చంద్రబాబు వారి ముందు ఉంచి వారికి వివరించారు. భవిష్యత్తులో తిరుపతి జిల్లాను మోడల్ జిల్లాగా మార్చాలని నిర్ణయించుకున్నామని ఈ క్రమంలో అందరూ కలిసికట్టుగా అభివృద్ధి విషయంలో ముందుకు సాగాలని కూడా తేల్చి చెప్పారు. తిరుపతి అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడేది లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇక వైసిపి పై విమర్శలు చేయడంలో వెనకబడుతున్న వారిని కూడా ఆయన మందలించారు. తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో వచ్చిన ఆరోపణల అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ పై వచ్చిన విమర్శలను సమర్ధవంతంగా తిప్పి కొట్టలేకపోయారని సీనియర్ నాయకులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇట్లాంటివి వచ్చినప్పుడే కదా మీ సత్తా తెలుస్తుంది అని కూడా తేల్చి చెప్పారు. పనితీరు మార్చుకోవాలని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎవరిని ఉపేక్షించేది లేదని, లాలూచీ రాజకీయాలను అసలు సహించేది లేదని కూడా చంద్రబాబు స్పష్టం చేయడం గమనార్హం. మరి ఏ మేరకు తిరుపతి నాయకులు మారతారు అనేది చూడాలి.

# యుద్ధం అక్కడ...

# వంటగదిలో మంట ఇక్కడ!

వెల్లడించింది.

**నిశ్శబ్దమైన సముద్ర మార్గం**

ఒకప్పుడు నిత్యం 100కు పైగా నౌకలతో కళకళలాడే హర్మూజ్ జలసంధి ఇప్పుడు వెలవెలబోతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో రోజుకు సగటున 83 నౌకలు ప్రయాణించగా, ఈ ఏడాది యుద్ధానికి ముందు ఆ సంఖ్య 106కు చేరింది. కానీ, యుద్ధం మొదలైన తర్వాత మార్చి మొదటి వారం నాటికి ఇది కేవలం 6 నౌకలకు పడిపోవడం గమనార్హం. ఈ మార్గం మూతపడటంతో సహజ వాయువు (చీఫ్‌బతీఖ్రీ +ఖం) ధరలు ఒక్కసారిగా 10 శాతం పెరిగి, యూనిట్‌కు 3.2 డాలర్లకు చేరుకున్నాయి.

**దేశాల వారీగా ఇంధన మంట**

ఎన్డీటీవీ సేకరించిన సమాచారం ప్రకారం.. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 మధ్య పెట్రోల్ ధరలు ఆస్ట్రేలియాలో 32 శాతం, అమెరికాలో 24 శాతం, సింగపూర్‌లో 21 శాతం మేర పెరిగాయి. డీజిల్ ధరల పరిస్థితి మరీ దారుణం. ఆస్ట్రేలియాలో అత్యధికంగా 40 శాతం పెరుగుదల నమోదు కాగా, సింగపూర్ (34 శాతం), అమెరికా (33 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, భారత్, బ్రెజిల్ వంటి దేశాల్లో ప్రభుత్వ నియంత్రణ వల్ల ధరలు స్థిరంగా ఉండటం సామాన్యులకు ఊరటనిచ్చే అంశం.

**వంటగ్యాస్ నుంచి విమాన ప్రయాణం దాకా**

వంటగ్యాస్ ధరల్లో కూడా భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. గ్రీస్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో ఎల్పీజీ ధరలు ఆకాశాన్ని తాకగా, రష్యా, సౌదీ వంటి ఉత్పత్తి దేశాల్లో తక్కువగా ఉన్నాయి. ఇక విమాన ప్రయాణికులపై కూడా ఈ భారం పడింది. విమాన ఇంధన ధరలు పెరగడంతో ఎయిర్ ఇండియా (రూ. 399), ఇండిగో (రూ. 425) వంటి సంస్థలు ఇప్పటికే 'ఫ్యూయల్ సర్చార్జ్'ను విధిస్తున్నాయి. ఆకాశ ఎయిర్ అయితే ఏకంగా రూ. 1,300 వరకు అదనపు భారాన్ని మోపుతోంది.

**భారత్‌లో వంటగ్యాస్ ధర పెంపు..:** ఎన్డీటీవీ పేర్కొన్నట్టుగానే, అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడంతో భారత్‌లో కూడా ప్రభావం మొదలైంది. మార్చి 7 న దేశీయ వంటగ్యాస్ (ఘా+) సిలిండర్ ధరపై కేంద్రం రూ. 60 మేర పెంచింది. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 913కి చేరింది. అటు అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటడం గమనార్హం.

## మొదటి పేజీ తరువాయి

పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గాలంటే..

# ఫ్రాన్స్ అధ్యక్షుడితో మోదీ ఫోన్ కాల్

మాట్లాడుతున్నారు. తాజాగా ఒమన్ సుల్తాన్, మలేషియా ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడితో సంభాషించారు. ఘర్షణలు తక్షణమే తగ్గించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో మాట్లాడినట్లు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అవసరమైన చర్చలకు ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకలు సురక్షితంగా వెళ్లే అంశానికి ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతోనూ ఇదే విషయమై చర్చించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు మరో పోస్టు చేశారు. " పశ్చిమాసియా ప్రాంతంలోని నెలకొన్న పరిస్థితులు, అక్కడ ఉద్రిక్తతలు తక్షణమే తగ్గించాల్సిన ఆవశ్యకతపై చర్చించాం" అని పేర్కొన్నారు. ఘర్షణలకు ముగింపు పలికేలా చర్చలు, దౌత్య మార్గాలను పునప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు ఇరుదేశాలు సమన్వయంతో ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

# ఇప్పటికైనా చెల్లికి జగన్ న్యాయం చేస్తాడని ఆశిస్తున్నా: విజయమ్మ

అందులో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చారు. ఆస్తుల విషయంలో చెల్లెలు, ఆమె పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని, వైఎస్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె అన్నారు. " తన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలని వైఎస్ఆర్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు దక్కాల్సిందే. షర్మిల హక్కుకు అనుగుణంగానే జగన్ ఎంవోయూ రాశాడు. వాస్తవానికి షర్మిలకు చెందాల్సిన దానికంటే తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ సహా యెలహంక భూమి కూడా షర్మిలదే. షర్మిలకు ఇప్పటి వరకు ఇచ్చానని చెబుతున్న డబ్బంతా డివిడెండ్ మాత్రమే. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఇప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నాను. నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు. దేవుడి సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అని ఆమె పేర్కొన్నారు.


# ఏపీకి వర్ష సూచన..

దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వడగళ్ల వాన పడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, కొన్ని సమయాల్లో గాలి వేగం గంటకు 60 కిలోమీటర్లకు చేరవచ్చని అప్రమత్తం చేసింది. ఇక ఉత్తర కోస్తాంధ్ర, యానాంలోనూ శు క్రవారం చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. ఉపరితల ఆవర్తనంతో పాటు గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి తమిళనాడు మీదుగా కర్ణాటక వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో మరో ద్రోణి విస్తరించి ఉండటం కూడా ఈ వర్షాలకు కారణంగా అధికారులు పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉష్ణోగ్రతల్లో మొదటి మూడు రోజులు పెద్దగా మార్పులు ఉండవని, ఆ తర్వాత స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

# అమెరికా ఎఫ్-35ని ఢీకొట్టామిలా..

కావడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి" అని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ వెల్లడించింది. అలాగే గాలిలో విమానాన్ని ఒక క్షిపణి ఢీకొడుతున్నట్టుగా ఉన్న వీడియోను రిలీజ్ చేసింది. మరోవైపు ఇదే ఘటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పందించారు. ఇరాన్ యుద్ధంలో భాగమైన ఫైటర్ జెట్ ఒకటి అత్యవసరంగా ల్యాండ్ అయిందని చెప్పారు. అది సురక్షితంగా దిగిందని, ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ఎఫ్-35ని క్షిపణుల వంటివి తాకి ఇలా ఎమర్జెన్సీ ల్యాండ్ అవడం ఇదే తొలిసారి. ఈ ఫైటర్ జెట్ విలువ వందల కోట్లలోనే ఉంటుంది. దీని కనీస విలువ రూ.82.5 మిలియన్ డాలర్లు (రూ.769 కోట్లకు పైగానే)గా ఉంది.

# పాత్రికేయుడు పూర్ణ మృతికి సంతాపం...!!



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

ఏబీఎన్ స్టేట్ బ్యూరో రిపోర్టర్ కేసంనేని పూర్ణచంద్రరావు అకాల మరణం పట్ల ఆనందపురం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మహంతి శివాజీ, రవి కిషోర్ పట్నాయక్, డబ్బీరు విజయ్ కుమార్, రెడ్డి లక్ష్మణ, దొంతల శ్రీను, రౌతు నాగరాజులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలపాటు జర్నలిజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన నిజాయితీ, నిబద్ధతకు ప్రతిరూపంగా నిలిచిన సీనియర్ పాత్రికేయుడన్నారు. వ్యక్తిగతంగా ఒక మంచి మిత్రుని కోల్పోయిన భావన కలుగుతోందని కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడం ఎంతో కలచివేసిందని దిగ్భ్రాంతి చెందారు. పరమపదించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శోకసంతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నిశ్చితార్థ వేడుకల్లో సిరి సహస్ర సందడి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

భీమిలి నియోజకవర్గంలోని పద్మనాభం మండలం, పాండ్రంకి పంచాయతీ పరిధిలోని ఏనుగులపాలెం గ్రామంలో కొట్యాడ బంగారు నాయుడు, రమణమ్మ దంపతుల కుమార్తె చి.వి. సాయి కుమారి నిశ్చితార్థ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రులు, గ్రామస్థుల మధ్య సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. వారి ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర హాజరై వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు ఇల్లాపు జగన్, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# మార్చి 22 నుంచి 26 వరకు ఆయుర్వేద శిబిరం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు మార్చి 22 నుంచి 26 వరకు విశాఖలో ప్రత్యేక ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కే యం ఉన్నికృష్ణన్ నాయర్ మార్చి 22 నుంచి 24 వరకు మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలో గల తమ కేంద్రంలో అందుబాటులో ఉంటారని అలాగే మార్చి 25,26 తేదీల్లో జీవిఎంసీ సమీపం రామ్ నగర్ కేంద్ర లో అందుబాటులో ఉంటారని తెలిపారు. అనేక దీర్ఘకాలిక సమస్యలు, హైపర్ టెన్షన్ (ఆందోళన) , ఆర్థరైటీస్ (కీళ్ళ వ్యాధులు ), నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక వత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. మురళి నగర్ శ్రీదేవి పార్క్ సమీపంలో గల తమ కేంద్రంలో డాక్టర్ ను సంప్రదించాలనుకే వారు అపాయింట్మెంట్ కొరకు 7675861446, 8008000670 నెంబర్లో సంప్రదించవచ్చునన్నారు.



# ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20:**

ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని సమగ్ర ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆనందపురం కూడలిని పరిశీలించిన వారు, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణం అమలు చేయగల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు పూల మార్కెట్ను సమీపంలోని రైతు బజార్కు కేటాయించిన 95 సెంట్ల స్థలానికి తరలించే అంశంపై చర్చించారు. అలాగే, దానికి ఆనుకుని ఉన్న ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని కూడా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఫ్లైఓవర్ కింద విస్తరణ పనులు చేపట్టి, తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రాంత పరిస్థితులను సూక్ష్మంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులు, పోలీస్ శాఖ, స్థానిక రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.


# మార్చి 23న పలు జోన్లయ పరిధిలో తాగునీటికి అంతరాయం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ టి. ఎస్. ఆర్ నుంచి హై లెవెల్ రిజర్వాయర్ కు వచ్చే ప్రధాన పంపింగ్ యొక్క పాత మోటార్స్ తీసి వాటి స్థానంలో కొత్త మోటార్స్ మార్పు చేయడం జరుగుతుం దని, అందుకు మార్చి 23వ (సోమవారం) తేదీన దిగువ తెలపబడిన పలు జోన్ల పరిధిలో కొన్నివార్డులలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జీవీఎంసీ ఈస్ట్ జోన్ లో 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీ, పెదవాల్తేర్, 21వ వార్డులోని తమిళ వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లి వీధి, ఎ.యూ. అవుట్ గేట్ డౌన్, ఓల్డ్ సిబిఐ డౌన్, మైత్రీ నగర్, వినయగార అపార్ట్మెంట్స్, కిర్లంపూడి లేఅవుట్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం బీచ్ రోడ్ సబ్మెరైన్, ఒస్యన్ వ్యూ లేఔట్ ఏరియా, చినవాల్తేర్, ఏరియా, 22 వ వార్డు లో బాలాజీ నగర్, టైమ్స్ అఫ్ ఇండియా, సిధార్థనగర్,28వ వార్డులో ఫాకర్స్ లేఔట్, కైలాస మెట్ల, రామ్ నగర్ మొదలైన ప్రాంతాలు. జీవీఎంసీ నార్త్ జోన్ లో 24వ వార్డులో ఓల్డ్ రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ప్రాంతాలు. అలాగే జీవీఎంసీ సౌత్ జోన్ 27వ వార్డులో అశోక్ నగర్, రామటాకీస్ రోడ్, శ్రీనగర్, బుద్దిల్ రోడ్, రెడ్డి హాస్పిటల్ రోడ్డు , శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్, ద్వారకా నగర్ రోడ్ నెం: 1 నుండి 6 లైన్ వరకు, అమర్ నగర్ చర్చ్ రోడ్, సి.బి.యం కాంపౌండ్, రామటాకీస్ లేడీస్ బుకింగ్ రోడ్ ప్రాంతాలలో తాగునీటికి అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున పై తెలిపిన ప్రాంతాలలో త్రాగునీటి సరఫరా కు కలుగు అంతరాయానికి నగర ప్రజలు సహకరించవలసినదిగా కమీషనరు వారి తరపున కోరడమైనది.

# విశాఖ రానున్న సీఎం చంద్రబాబు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మార్చి,20**

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుంటారు , ఎయిర్పోర్ట్ నుండి అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, చందనాడ గ్రామం చేరుకుని ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడినుండి వాయు మార్గం ద్వారా విజయవాడ వెళ్తారు.

# రాష్ట్ర గవర్నర్ విశాఖ పర్యటన వివరాలు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఈనెల 24వ తేదీ రాత్రి 9:00 గంటలకు వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుని రాత్రికి ఒక హోటల్లో బస చేస్తారు.25 వ తేదీ ఉదయం10:00 గంటలకు ఆంధ్ర యూనివర్సిటీ కాన్వకేషన్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:00 గంటలకు విశాఖపట్నం నుండి వాయు మార్గం ద్వారా విజయవాడ వెళ్తారు.

# భారీ గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష లక్ష రూపాయల జరిమాన

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం గంజాయి మాఫియాపై సాగిస్తున్న పోరాటంలో మరో కీలక విజయం నమోదైంది. 2015లో చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన భారీ గంజాయి రవాణా కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ విభాగం విజయం సాధించాయి.జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.?చోడవరంలోని తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.హరి నారాయణ ఈ కేసులో కీలక తీర్పును వెల్లడించారు. నిందితుడు 1కోరుకొండ అప్పల పాత్రుడుఏరాజు 32 ఏళ్ళు,విజయనగరం జిల్లా, నేరానికి పాల్పడినట్లు ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాల ద్వారా నిరూపితమైంది.ఈ మేరకు జడ్జి నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.1,00,000/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా మరో 2 ఏళ్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.?16.07.2015న చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వద్ద అప్పటి సబ్-ఇన్స్పెక్టర్ బి.రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో లారీ మరియు మోటార్ సైకిల్ పై తరలిస్తున్న 175 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులపై చీణూా చట్టం కింద కేసు (జతీఅఎవ చీశీ. 102/2015) నమోదు చేశారు.పరారీలో ఉన్న రెండో నిందితుడు ూ2 కిల్లో బాబురావు పై చీదీఔ పెండింగ్లో ఉన్నందున, అతని కేసును వేరు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.?ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ చీపురుపల్లి సూర్యనారాయణని, కోర్టు విచారణలో కీలక పాత్ర పోషించిన కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని,అప్పటి దర్యాప్తు అధికారి సహా చోడవరం పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్



సిన్హా ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. నిందితులకు శిక్ష పడేలా చేయడంలో పోలీసుల అంకితభావం,న్యాయ విభాగంతో సమన్వయం ఎంతో గొప్పదని ఎస్పీ కొనియాడారు.గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని వారు హెచ్చరించారు.

# రంజాన్ తోఫా వేడుకలు ఘనంగా 39వ వార్డులో ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం - ప్రముఖుల హాజరు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 20**

రంజాన్ పర్వదిన ఆత్మను ప్రతిబింబిస్తూ సేవా కార్యక్రమాలతో ముందుండే 39వ వార్డు అధ్యక్షులు ఎండీ ముజీబ్ ఖాన్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే రంజాన్ సందర్భంలో, అవసరమైన వారికి తోడుగా నిలవాలనే లక్ష్యంతో వార్డు కార్యాలర్తలకు రంజాన్ తోఫా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముజీబ్ ఖాన్ నాయకత్వంలో ఈ కార్యక్రమం సార్థకంగా నిలిచిందని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ హాజరై,



ముజీబ్ ఖాన్ సేవలను కొనియాడారు. రంజాన్ సందేశమైన సౌభ్రాతృత్వం, దాతృత్వం సమాజానికి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. దక్షిణ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు బాబ్జి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు అందరూ కలిసి సామాజిక ఐక్యతను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా వార్డు కార్యాలర్తలకు రంజాన్ తోఫాలను అందజేసి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం వార్డులో ఆనందోత్సాహాలను నింపింది. స్థానికులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ముజీబ్ ఖాన్ సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పులకు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు.

# సమస్త జీవరాశినీ కాపాడే బాధ్యత మానవాళి దే

## పిచ్చుకల పరిరక్షణ బాధ్యత మనదే - పశుపక్ష్యాదుల కోసం వేసవిలో నీరు అందుబాటులో ఉంచండి

## ప్రకృతి తో మమేకమై జీవించుదాం - ఎన్ రామచంద్ర రావు, డిఎఫ్ఒ, కాకినాడ





**కాకినాడ, సిటిజన్ టైమ్స్, మార్చి 20:**

సమస్త జీవరాశినీ కాపాడే బాధ్యత మానవాళిదే అని కాకినాడ డిఎఫ్ఒ ఎన్, రామచంద్ర రావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కాకినాడ లోని శ్రీ విద్యా కాలనీ లోని ఎకొ ప్లాంట్ నర్సరీ అండ్ గార్డెన్ మార్ట్, విశాఖ కు చెందిన గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ల నేతృత్వంలో ప్రపంచ పిచ్చుకల పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పక్ష్యాదుల కోసం వేసవిలో నీరు అందుబాటులో ఉంచండి అని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి తో మమేకమై జీవించుదాం అన్నారు. ప్రతి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు తప్పకుండా తాను సహకారం అందిస్తాం అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సమస్త జీవరాశినీ కాపాడటమే మానవత్వం అన్నారు. జీవజాతులు లో ఏది అంతరించినా మానవాళికి పెనునష్టం జరుగుతుంది అన్నారు. జెఎన్ టియుకె విశ్రాంత ఉపకులపతి కెవిజి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతివనరుల పరిరక్షణకు ప్రకృతి కార్యశాలలు నిర్వహించడం అవసరం అన్నారు. హరిత వందనాలు తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. పక్షి ప్రేమికులు కె మృత్యుంజయ రావు మాట్లాడుతూ భూమి మీద ఏ జీవికూడా అంతరించరాదన్నారు. వలస పక్షుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయం ముందుగా బియ్యం పిండి తో మహిళలు ముగ్గులు వేసారు, ధాన్యం కంకులతో కుచ్చులు తయారీ విధానం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ప్రతినిధి రాజేశ్వరి మహిళలకు నేర్పారు. పలువురు మహిళలు పిచ్చుకల తో ఉన్న దుస్తులు ధరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, ఎపి నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల చలపతి రావు, ఎకొ ప్లాంట్ నర్సరీ అండ్ గార్డెన్ మార్ట్ ప్రతినిధి బి రామారావు, పర్యావరణ ప్రేమికులు బాలాజీ కిషోర్, మేంగొ మేన్ అప్పాజీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో కల్లు గీత కార్మికుల కమ్యూనిటి హాలు శంఖుస్థాపన...



**మలికిపురం సిటిజన్ టైమ్స్, మార్చి 20**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మల్కిపురం మండలం చింతలమోరి గ్రామం బీచ్ నగర్‌లో గ్రామ సర్పంచ్, రాజోలు నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ రాపాక రమేష్ బాబు వారి సొంత నిధులతో నూతనమగా నిర్మిస్తున్న కల్లు గీత కార్మికుల కమ్యూనిటి హాలుకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మాట్లాడుచూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఓగురి మనోహర్, టిడిపి గ్రామ శాఖఅధ్యక్షులు దొడ్డ చంద్రశేఖర్, వాటర్ డిస్టిబ్యూటీ కమిటీ ఛైర్మన్ రాపాక ఈశ్వర రావు, బీచ్ నగర్ సంఘం ప్రెసిడెంట్ కొల్లాబత్తుల భీమారావు, ఎన్డీఏ కూటమి నాయకులు గంధం రాంబాబు, చవ్వాకుల వెంకటరత్నం, మైనం వెంకటస్వామి, రాట్నాల నాగేశ్వరరావు, రాపాక సత్యనారాయణ, గేడ్డం అశోక్, రాపాక సురేష్ బాబు, రాపాక మహేష్, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో రోడ్లకు మహర్దశ



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 20**

దశాబ్దాల కాలం నుంచి రంగాపురం శివారు మెట్ట గొల్లగూడెం గ్రామం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న నూతన రోడ్లు ఈరోజు ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈరోజు రంగాపురం గ్రామం మెట్ట గొల్ల గూడెం లో యువ నాయకులు రంగాపురం సర్పంచ్ ముసు నూరి రాము ఆధ్వర్యంలో నూతన రోడ్లకు శంకుస్థాపన జరిగింది. సుమారుగా 90 లక్షల రూపాయలు నిధులు ఎంపి మరియు ఎమ్మెల్యే నిధులు ద్వారా సమకూర్చారు ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు ఓబిళ్ళనేనీ శేషగిరిరావు కార్య కర్తలు నాయకులు కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన ప్రజలు.

## మురికి నీరు నిల్వలు లేకుండా చూడాలి....



**శంఖవరం, సిటిజన్ టైమ్స్, మార్చ్ 20**


ఇంటి పరిసర ప్రాంతాలలోనూ అలాగే డ్రైనేజీ వ్యవస్థలోను మురికినీరు నిలవల్లేకుండా సిబ్బంది చూడాలని జిల్లా మలేరియా అధికారి ప్రభాకర్ రావు అన్నారు. కత్తిపూడి పంచాయతీ పరిధి సంబంధించి ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామ విధుల్లో పర్యటించారు. బావులు, డ్రైనేజీలు, ఇంటి పరిసరాలను పరిశీలించారు, మురికి నీరు నిలువ లేకుండా ఇటు సిబ్బంది అటు గృహ యజమాని చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఈగలు చేరి ప్రజా ఆరోగ్య భంగం కలిగిస్తాయన్నారు అన్నారు. ఎవరైనా జ్వర పిడుతులు ఉంటే వెంటనే గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షణ ఉండాలన్నారు. అధికారులు పతాంజలి, ప్రసాద్, తాతారావు, నాగమణి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ లు సక్రమంగా గ్యాస్ సరఫరా చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 20**

ప్రస్తుత ఎల్పిజి వంట గ్యాస్ కొరత నేపద్యంలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, ప్రభుత్వ ఆదేశాలను తప్ప కుండా ఆచరిస్తూ గృహ నియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఎక్కడ ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం కాకుం డా ప్రభుత్వానికి పూర్తిగా సహకరించాలని గ్యాస్ డైలర్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి ఆదేశించారు. శుక్ర వారం స్థానిక ప్రాంతీయా సుపత్రి సమీపంలోని శ్రీ రాజేశ్వరి హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఏజెన్సీలోని స్టాక్ రికార్డులను డెలివరీ రికార్డులను పరిశీలించి డీలర్లకు సక్రమ సరఫరా పై పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. గత 25 రోజులుగా గ్యాస్ జనరల్ బుకింగ్ డెలివరీ ప్రక్రియ లను రికార్డు ఆధారంగా తనిఖీ చేశారు. పట్టణాల్లో 25 రోజులు గ్రామాలలో 30 రోజులు కాలవ్యవధి లలో సిలిండర్లు పానిక్ కృత్రిమ కొరతకు ఆస్కారం లేకుం డా సరఫరా చేయాలని ఆదేశించారు. బుకింగ్ ప్రక్రియకు అనుగు ణంగా మాత్రమే గృహ వినియోగ దారులకు గ్యాస్ సరఫరా చేపట్టాలన్నారు. అంతర్జాతీయంగా ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, జిల్లాలో ఎల్పిజి వంట గ్యాస్ కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, అ ప్రకారమే గ్యాస్ ఏజెన్సీలు సక్రమంగా గ్యాస్ సరఫరా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డీలర్లను ఆదేశించారు. గృహ వినియోగదా రులకు గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగకూడదన్నారు. ఎట్టి పరిస్థి తుల్లో నూ గృహ వినియో గదారులకు గ్యాస్ డెలివరీలో ఆలస్యం జరగకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. అక్రమ నిల్వలు ఏర్పాటు చేయరాదని అదేవిధంగా గ్యాస్ కొరత ఉందనే సాకుతో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.?పారదర్శకతతో బుకింగ్ చేసుకున్న వినియోగదా రులకు ప్రాధాన్యత క్రమంలో సిలిండర్లను పంపిణీ చేయాల న్నారు పంపిణీ ప్రక్రియపై పౌరస రఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గ్యాస్ లభ్యతపై విని యోగ దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగినంత నిల్వలు ఉండేలా ప్రభుత్వం



చర్యలు తీసుకుం టోందని ఆమె స్పష్టం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాజేశ్వరి హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీపై నిర్వహించిన తనిఖీ చాలా ప్రాముఖ్యతను సంత రించుకుందన్నారు. అంతర్జా తీయ పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటం అత్యంత అవసరమన్నారు. గ్యాస్ సిలిండర్లను కేవలం గృహ వినియోగదారుల కు మాత్రమే సక్రమంగా సమయానికి అందించాలన్నారు.వాణిజ్య వినియోగానికి గృహ సిలిండర్లను మళ్లించడం పూర్తిగా నిషేధమన్నారు. ఏజెన్సీలు పారదర్శకతతో పనిచేసి, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ప్రజలు కూడా అవగాహనతో ఉండి, ఎలాంటి అక్రమాలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే గ్యాస్ సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతుందన్నారు, ప్రభుత్వ సూచనలు కేంద్రం ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్‌ను అమలు చేసి, గృహ వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించిందన్నారు.పానిక్ బుకింగ్‌ను నివారించి ఆన్‌లైన్ బుక్ చేయాలన్నారు. మానిటరిం గ్ కమిటీలు ఏర్పాటు చేసి, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు ఈ కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి శరత్, తాసిల్దార్ దివాకర్ సిఎస్డిటి భారతి, తూనికలు కొలతలు కంట్రోలింగ్ అధికారి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య సంస్థలపై ఆకస్మిక దాడులు

### 140 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం






**కాకినాడ బ్యూరో ఇంచార్జ్ సిటిజన్ టైమ్స్ మార్చి 20**

కాకినాడ ,పెద్దాపురం డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో తనిఖీల్లో పాల్గొన్న ఆర్డీవో, తహసిల్దార్లులి కొంత మంది వాణిజ్య సంస్థల యజమానులు డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారనే సమాచారంతో జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సంబంధిత ఆర్డీవో లు,పలు వాణిజ్య సంస్థలను తహసీల్దార్ లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాకినాడ డివిజన్ లో వివిధ సంస్థల నుంచి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 80 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు తెలిపారు. అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించిన వ్యక్తుల పై కేసులు నమోదు చేసి అత్యవసర వస్తువుల చట్టం సెక్షన్ 6ఏ కింద చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.పెద్దాపురం డివిజన్లో సుమారు 60 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆర్డీవో ఎస్. మల్లిబాబు తో పాటు ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## వీరవల్లిపాలెం గ్రామంలో రిపోర్టర్ మృతి కి ప్రగాఢ సంతాపం



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ మార్చి 20**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం చెందిన పత్రికా విలేఖరి, వే టు న్యూస్ రిపోర్టర్ ముద్దన సుబ్రహ్మణ్యం గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందినారు. గురువారం సాయంత్రం గ్రామంలో జరిగిన జాతర కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కార్యక్రమంలో పాల్గొని, ఇంటికి వెళ్లిన అనంతరం అస్వస్థతకు గురై అనంతరం రెండు గంటల సమయంలో గుండెపోటు రావడంతో అమలాపురంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు తెలిపినారు. మారుమూల విషయములను కూడా సేకరించి పత్రికారంగంలో చైతన్యవంతము గల రిపోర్టర్ గా సుబ్రమణ్యం పేరును పొందినారు.చిన్న వయసులోనే గుండెపోటుతో అకస్మకంగా మృతి చెందడంతో అందరి హృదయాలలో విషాదఛాయలు చోటు చేసుకున్నవి.ఆయనకు భార్య ఇద్దరు కుమారులు కలరు. సుబ్రహ్మణ్యం మృతితో గ్రామంలో విషాద చాయలు ఏర్పడినవి. మృతికి వీరవల్లిపాలెం గ్రామ పెద్దలు ,నాయకులు, అధికారులు అయినవిల్లి మండలం పత్రికా విలేకరులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన ప్రెస్ క్లబ్ ఛైర్మన్, అయినవిల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పి.నాగ శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ సభ్యులు తమ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు.

# సిటిజన్ టైమ్స్ ఉగాది తెలుగు క్యాలెండరు బాగుంది

### ప్రజా ప్రతినిధులకు పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి

### సిటిజన్ టైమ్స్ హిందూ క్యాలెండర్ ప్రచురణ చేయడం పైన హర్షం వ్యక్తం చేసిన మంత్రి

### సిటిజన్ టైమ్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపిన మంత్రి



**నూజివీడు:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:20**

ఉగాది పండుగ పురస్కరించుకొని సిటిజన్ టైమ్స్ తెలుగు పత్రిక పంచాంగం క్యాలండర్ ప్రచురణ చేయడం జరిగింది.ఈ క్యాలెండర్ ను రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. సిటిజన్ టైమ్స్తెలుగు క్యాలెండరు చాలా బాగుందని,హిందువులు అందరికి తెలుగు క్యాలెండరుని పంపిణీ చేయాలనితెలిపారు. అనంతరంప్రజా ప్రతినిధులకు పంపిణీ చేసిన మంత్రి, ప్రజా సమస్యలపై వార్తలు రాయాలని, ప్రజల సమస్యలు వార్తపత్రికల ద్వారానే ప్రభుత్వం దృష్టికి వస్తాయని పేర్కొన్నారు. పత్రికలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండదండలు అందిస్తుందని, జర్నలిస్టుల సమస్యలపై త్వరలో మరోసారి సీఎం గారి దృష్టిలో పెడతామని, ఇప్పటికే జర్నలిస్టుల సమస్యలపై సీఎం గారు దృష్టి సారించారని తెలిపారు.ఈ సందర్భంగా సిటిజన్ టైమ్స్ యాజమాన్యం కి మంత్రి అభినందనలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఇఫ్తార్ విందులో శాసన సభ్యులు దేవ...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 20**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అంతర్వేదిపాలెం జామియా మసీదు నందు జరిగిన ఇఫ్తార్ విందులో రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ పాల్గొనినారు. ముస్లిం సోదరులతో కలిసి విందును స్వీకరించి, ఎమ్మెల్యే దేవ ముస్లిం సోదరులకు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లిబాబు, సర్పంచ్ నల్లి లీలావతి బాబు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రంజన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ బ్యూరో ఇన్చార్జ్ మార్చి 20**

జిల్లాలోని ముస్లిం సోదరులకు రంజాన్ ( ఈద్ – ఉల్ – ఫితర్ ) పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్దం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, మత సామరస్యంతో ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఒక ప్రకటనలో ఆయన సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# వైఎస్ఆర్సిపి సజ్జల రామకృష్ణారెడ్డి కలిసిన కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 20**

గుంటూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గనికి సంబంధించిన పలు కీలక అంశాలపైన, నియోజవర్గం లో జరుగుతున్న కమిటీలు నిర్మాణాల గురించి సజ్జల రామకృష్ణ రెడ్డి తో అమలాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అమలాపురం నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు దూడల ఫణి ,కుమ్మరి అభి ఉన్నారు...

# మంత్రి నారా లోకేష్‌కి రెవల్యూషన్ స్టూడెంట్ యూనియన్ కృతజ్ఞత




**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 20**

గడియార స్తంభం సెంటర్ నందు రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన జాబ్ కేలండర్ విడుదల చేసినందుకు మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞత చెబుతూ కార్యక్రమం చేపట్టడం జరిగింది.నారా లోకేష్ యువగలం పాదయాత్ర లో ప్రతి సంవత్సరం ఉగాదికి జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసి నిరుద్యోగులకు ఆదుకుంటామని, కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగతను తగ్గించే విధంగా ప్రణాళిక తయారు చేస్తానని, ఇచ్చినటువంటి వాగ్దానాన్ని నిలబెట్టుకున్నటువంటి నారా లోకేష్ కి రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ కంటేపల్లి నరేంద్ర కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అదేవిధంగా మెగా డీఎస్సీ కూడా త్వరగా విడుదల చేయాలని కోరుకుంటూ దీనివల్ల రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులకు మేలు జరుగుతుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాము బాలు శరత్ విజ్ఞాన్ సాయి సంపత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరు

గ్రామ సీమలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలులో మండల ప్రజా పరిషత్తు అధికార్లు, పాలకవర్గ సభ్యులు పాత్ర కీలకం.

గ్రామాల్లో త్రాగునీరు, సాగునీరుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాలు ప్రజలకు, రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుని అమలు చెయ్యాలి.

రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అందించుటకు అధికార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి





**ముసునూరు:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:20**

ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం,ముసునూరు యంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 22 శాఖలు అధికారులు శాఖలు వారీగా ప్రగతిని వివరించారు. మండలంలో రూ 41.20 కోట్లుతో అభివృద్ధి పనులు, అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను యంపిడివో వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేశారని, ముఖ్యముగా స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చెయ్యక, అభివృద్ధి, సంక్షేమ పథకాలు కుంటుబడ్డాయని అన్నారు. ఒక సంవత్సరంలోనే మండలంలో రూ 41.20 కోట్లుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు అయ్యాయని, కొన్ని పూర్తయి, కొన్ని పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. మండలంలో 6 వేలు ఎకరాలు భూమి నిరుపయోగంగా ఉందని ఆ భూమిని సాగులోకి తెచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో 350 విద్యుత్తు ట్రాన్స్ఫర్లు అవసరం ఉండగా 10 రోజుల్లో 150 ట్రాన్స్ఫర్లను తీసుకువచ్చి ప్రయారిటీ ప్రకారం, పారదర్శకంగా ట్రాన్స్ఫర్లు అమర్చుచున్నామని తెలిపారు. మిగతా ట్రాన్స్ఫర్లు కూడా తీసుకువచ్చిఎక్కడ కూడా లోవోల్టేజి సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టి, అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చెయ్యాలని సూచించారు. ముఖ్యంగా గృహనిర్మాణ పథకాలు అమలులో పారదర్శకతను పాటిస్తూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలతో సమన్వయం పెంచుకుని, ప్రభుత్వ సేవలను వేగవంతంగా అందించాలని అన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు అమలులో స్థానిక సంస్థలు పాత్ర ఎంతో కీలకమని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాలు, మౌలిక వసతులు, తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకతతో అమలు చేసి, సమన్వయంతో పనిచేయ్యాలని సూచించారు. పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని, జఠిలం అయ్యిన సమస్యలు తన దృష్టికి తీసుకురావాలి అని అధికారులకు సూచించారు. ప్రజలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే పరిస్థితి చెయ్యిదాటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండల అధికారులు, గ్రామ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ జల దినోత్సవ అవగాహనపై గోడ పత్రిక ఆవిష్కరణ



**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, మర్చి 20**

ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హఫీజ్ పేటలోని జల మండలి కార్యాలయములో ప్రపంచ జల దినోత్సవ అవగాహనపై ముద్రించిన గోడపత్రికను హైదరాబాదు మహానగర జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, ఛీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, 15వ డివిజన్ జనరల్ మేనేజర్ రమావత్ కృష్ణ లతో కలిసి అసోసియేషన్ కన్వినర్ రామస్వామి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఐక్యరాజ్యసమితి వారు మార్చి 22వ తేదీని ప్రపంచ జల దినోత్సవముగా ప్రకటించి ప్రతి సంవత్సరం వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ప్రకృతి ప్రసాదించిన నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడటమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. భూగోళంలో 97శాతము ఉప్పునీరే. మిగతా 3శాతము నదులు, సరస్సులు, మంచు పర్వతాలు గా ఉన్నాయని, సకల జీవకోటికి గాలి తరువాత నీరే ప్రధానమైనది కావున చెరువుల ద్వారా 0.86%, నదుల ద్వారా 0.02%, భూగర్భ జలాల ద్వారా 0.12% మాత్రమే నీరు లభ్యమవుతున్నది అని తెలిపారు. ఇది ఒక సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణతో పాటు ఇతర రసాయనిక పదార్థాలతో కలుషితం కాకుండా కాపాడుకోవడం వంటి చర్యలు చేపట్టాలి. ఇది ప్రభుత్వంతో పాటు పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు అందరు కలిసి ఆచరిస్తేనే పర్యావరణ రక్షణతో పాటు సకల జనులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు అని తెలిపారు. ఈ సందర్భంగా అందరిచేతా నీటి సంరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మారబోయిన సదానంద్ యాదవ్, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, రావు, శివరామరెడ్డి, జనార్ధన్, ఉమా చంద్రశేఖర్, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# లింగపాలెం మండలంలో ఘరానా మోసం



**లింగాపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 20**

బాధితులపై దాడి చేసిన ఫెర్టిలైజర్ షాపు యజమాని బేతిన మధు వ్యాపార అభివృద్ధి పేరుతో డిపాజిట్లు వసూలు చేసి తిరిగి అడుగునందుకు బాధితులపై భౌతిక దాడికి దిగిన ఘటన లింగపాలెం మండలంలో కలకలం రేపింది. తోచిలక రాయుడుపాలెం గ్రామానికి చెందిన వలిమి ధనలక్ష్మి ఎ/శీ అప్పారావు వీరికి ముగ్గురు ఆడపిల్లలు వీరు రోజువారి కూలీలు రోజు కూలి పని చేసుకుని కొంత డబ్బును లింగపాలెం గ్రామంలోని శ్రీ సాయిరాం ట్రేడర్స్ లో డిపాజిట్ చేసినారు వారి కుటుంబ అవసరాల నిమిత్తం డబ్బులు అడగగా మాపై దుర్భాషలాడి దాడిచేసిన బెతిన నాగ వెంకట మధు అనే వ్యక్తి బాధితురాలు ఆరోపిస్తున్నారు డిపాజిట్ గా తీసుకున్న డబ్బును తిరిగి ఇప్పించాలని నాయకులను అధికారులను బాధితురాలు కోరుతున్నారు.

# చలో వీరవాసరం..

## ప్రపంచంలో డాలర్ విలువ పెరగాలన్న తగ్గాలన్న "ఇటు ఆక్వా అటు సాఫ్ట్వేర్" -ఇచ్చిన హామీలను నెరవేర్చేది ఎప్పుడు ?

## రైతుల మనుగడను దూరం చేస్తున్న దళారీ వ్యవస్థ -రైతుల నడ్డి విరుస్తున్న సిండికేట్ వ్యవస్థ

**కాత్రేనికోన సిటిజన్ టైమ్స్ మార్చి 20**

ఈనెల 22 వ తేదీ ఆదివారం వీరవాసరం తులసి కన్వెన్షన్ హాల్లో జరిగే ఆక్వా రైతుల సదస్సుకు వేలాదిగా రైతులు తరలి వెళ్తున్నట్లు ఆక్వా ఫెడరేషన్ నాయకులు త్సవటపల్లి నాగభూషణం ప్రతిపారు, ఉభయ గోదావరి జిల్లాల నుండి హాజరు కాబోతున్న ఆక్వా రైతులు ప్రత్యక్షంగా పరోక్షంగా రైతులకు అండగా ఉండవలసిన ప్రభుత్వం ఆదరణ కరువై పూర్తిగా దళారీ వ్యవస్థలో ఆక్వా వ్యవస్థ నడుస్తుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతుంటే ఆక్వా రైతులకు కరెంటు సబ్సిడీలో గాని, మేతల సబ్సిడీలో గాని, రాయితీలు ఇవ్వాల్సిన ప్రభుత్వం నుండి ఏ విధమైన స్పందన లేక ఇటు దళారి వ్యవస్థ వలన అటు సిండికేట్ వ్యవస్థ వలన మధ్య ఆక్వా రైతులు విలవిలాడుతున్నారని పేర్కొన్నారు.దళారి వ్యవస్థ నుండి ప్రభుత్వం సమస్యను పూర్తిగా తాత్సారం చేస్తుందంటూ ఆక్వా రైతులు మండిపడుతూ చేసేదేమీ లేక ప్రభుత్వం పై ఉద్యమించడానికి ఆక్వా రైతులు ఉద్యమ బాట పట్టినట్లు తెలిపారు.టాక్స్ లపై టాక్సు విధిస్తూ టన్నుకి ఇంత అని చెప్పి వసూల్ చేస్తున్న దళారీ వ్యవస్థలను రూపుమాపవలసిన ప్రభుత్వ వ్యవస్థ పూర్తిగా సిండికేట్ కు ప్రత్యక్షంగాను,పరోక్షంగాను సహకరిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయంటూ మండి పడుతున్నారు.ఆక్వా రంగం ప్రపంచంలోనే



డాలర్ విలువ పెరగాలన్న ,పడిపోవాలన్న, ఒకవైపు ఆక్వా రంగం, మరోవైపు సాఫ్ట్వేర్ ,ఇలాంటి పరిస్థితుల్లో డాలర్ విలువ 93 రూపాయలు పెరిగితే, ఆక్వా రైతులను ఆదుకోవాలని, ప్రభుత్వానికి దిశా నిర్దేశం లేకుండా వ్యవహరిస్తున్న తరుణంలో ఆక్వా రంగంలో రైతులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి కంకణం కట్టుకున్నారు .అందులో భాగంగా ఆదివారం 22న వీరవాసరం తులసీ కన్వెన్షన్ హాల్లో జరగబోయే భారీ బహిరంగ ఆక్వా సభకు వేలాది ఆక్వా రైతులు హాజరు కాబోతున్నట్లు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలో 60,70 శాతం ఆక్వా చెరువులు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కల్పిస్తుంటే అందులో భాగంగా ఈస్ట్ గోదావరి నుండి 25 పాపం శాతం ఆదాయాన్నిస్తున్న రైతులపై ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి ప్రభుత్వం కల్పించడం ఏమిటో అర్థం కాని పరిస్థితుల్లో రైతులు మనోవేదన చెందుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను పూర్తిగా ఆదుకుని రైతులకు ఇవ్వాల్సిన పవర్ సబ్సిడీ ,మరోవైపు మేతలపై ట్యాక్స్ తగ్గించి సబ్సిడీ వ్యవస్థలో రైతులకు పూర్తి న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి తెలిసేలా,చలో.. వీరవాసరం సభ విజయవంతం చేసేలా ఆక్వా రైతులంతా కంకణం కట్టుకుని హాజరుకావాలని, విజయ వంతం చేయాలని ఆక్వా నాయకులు త్సవటపల్లి నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు.

# తూర్పు మధ్య దేశాల్లో యుద్ధ పరిస్థితుల మూలంగా గ్యాస్ నిల్వలు తగ్గుతాయనే ప్రచారం జరుగుతోందని వచ్చిన సమాచారం కారణం





**కాకినాడ బ్యూరో ఇన్చార్జ్ సీజన్ టైమ్స్ మార్చి 20**

కాకినాడ జిల్లాలో జిల్లా సంయుక్త కలక్టరు అపూర్వ భరత్ , ఐ.ఎ.ఎస్ వారు రెవిన్యూ మరియు పౌర సరఫరా అధికారులు , ఆయిల్ కంపెనీ ప్రతినిధులు మరియు గ్యాస్ ఏజన్సీ డీలర్లుతో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వినియోగదారులకు అవసరమైన వంట గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉంచు విధంగా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోంది . ఈ సందర్భంగా శుక్రవారం తేదిన ముఖ్యమంత్రి మంత్రివర్యులు , పౌర సరఫరాల శాఖ మరియు కమిషనరు , పౌర సరఫరాల శాఖ వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్ పి జి సరఫరా , నిల్వలు సూచనలు జారీ చేయుచూ వినియోగదారులకు అవసరమైన వంట గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉంచు విధంగా అవసరమైన చర్యలు తెసుకోవాలని సూచించారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వారు జిల్లాలోని తహసిల్దార్లు మరియు సివిల్ సప్లై ఎన్ఫోర్స్ మెంట్ సిబ్బందికి సూచనలు జారి చేయుచూ ఎల్ పి ఏజన్సీలు పర్యవేక్షణ చేయవలసినదిగా మరియు డొమెస్టిక్ ఎల్ పి జి సిలెండర్లు వ్యాపార అవసరాల నిమిత్తం వినియోగిసున్న వారిపై విస్తృతమైన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సదరు ఆదేశాలకు అనుగుణంగా శుక్రవారం వివిధ మండలాలలో 9 కేసులలో 15 డొమెస్టిక్ సిలండర్లు వెరసి ఇప్పటివరకు మొత్తం 44 కేసులలో 98 డొమెస్టిక్ సిలండర్లు సీజ్ చేసియున్నారు.

కాకినాడ జిల్లాలో వినియోగదారులు వారికి ఎటువంటి ఇబ్బందికి గురికాకుండా ఉండు నిమిత్తం నిరంతరం గ్యాసు నిమిత్తం తగు సమాచారం అందించుటకు కలెక్టరేట్ కాంపౌండ్ నందలి జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయం , కాకినాడ నందు ఫోన్ నెం . 8886903611 తో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగింది . అదే విధంగా మండల స్థాయిలో కుడా అన్ని తహశీల్దార్ కార్యాలయాల నందు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడమైనది. వినియోగదారులు గత గ్యాస్ డెలివరి అయిన 25 రోజులు తదుపరి బుకింగ్ చేసుకుంటే వారికి నిల్వల ఆధారంగా డెలివరి జరుగునని , ఆందోళన చెంది ముందుగా కొత్త రిఫిల్ బుక్ చేస్తున్నారని , ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని , ఏజన్సీలు వద్ద ప్రస్తుతం 15093 సీలందర్లు నిల్వ ఉన్నాయని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. కంట్రోల్ రూము ద్వారా మరియు ఇతర ఫిర్యాదులు ద్వారా వచ్చే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిచాలని జిల్లా పౌర సరఫరాల అధికారినీ ఆదేశించారు. కంట్రోలు రూముకు 125 పిర్యాదులు రాగా వాటిని 100 % పరిష్కరించామన్నారు.

## 25 మందికి రూ.12.74 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ మార్చి 20**

నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 25 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12.74 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 1,36,240 మందికి 1241 కోట్ల మేర ఆర్థిక, వైద్య సాయం సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించినట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో సీఎం సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు.అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, వనుం వీరబ్రహ్మం, నారపురెడ్డి బలరాం, గున్నం వినోద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం లక్ష్యం...

### గొల్లపల్లి అమూల్య.





**రాజోలు సిటిజన్ టైమ్స్, మార్చి 20**

కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం 21 వ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కేడర్ విత్ లీడర్" కార్యక్రమం ను రాజోలు టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య తాటిపాక గ్రామంలో జి ఎస్ గార్డెన్స్ కార్యాలయం వద్ద నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు, కూటమి శ్రేణులు, పార్టీ నాయకులతో కలిసి అర్జీలు స్వీకరించారు. అమూల్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి దిశగా నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తుందని, రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా, స్వయం ఉపాధి, మహిళా శక్తి, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు పెద్దపీట వేయడం, దివ్యాంగ శక్తి పేరుతో దివ్యాంగుల సంక్షేమం, చిన్న తరహా పరిశ్రమలు, ఆక్వా రంగం, రవాణా వ్యవస్థ మెరుగు పడడానికి త్వరగా రోడ్ల నిర్మాణం తో చూస్తే అన్ని రంగాల్లోనూ ఇచ్చిన హామీల మేరకు ప్రతి హామీని నెరవేర్చడానికి మన కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తూ ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడంలో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్ చూపిస్తున్న చొరవ అభినందనీయమని వీరందరికీ రాజోలు నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిటికెల రామ్మోహన్ రావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, లంకే శ్రీనివాసరావు, జిల్లా పార్టీ కార్యదర్శి రాపాక నవరత్నం, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అడబాల రమాదేవి శేషారావు, మండల పార్టీ అధ్యక్షులు బోణం సత్య నాగేశ్వరరావు, అనుచూరి సునీత రామ పురుషోత్తం, అడబాల సాయిబాబా, తాడి సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి విత్తనాల జానకిరామ్, సర్పంచులు కోటిపల్లి రత్నమాల, నల్లా పరంకుశరావు, కట్టా సూరిబాబు, గ్రామాల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వేత్త 'రేలంగి' కి ఘన సన్మానం

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 20**

శ్రీ పరాభవ నామ సంవత్సరాది సందర్భంగా అమలాపురంలో ఐ. ఎం. ఎ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోషియేషన్, కోనసీమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకలలో అమలాపురం నకు చెందిన ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ చే పంచాంగ పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.ఎం.ఎ సభ్యులైన డాక్టర్స్ ఆధ్వర్యంలో కుమార్ శంకర్ గౌడ్ ను సన్మానించారు.



## పునః నిర్మాణానికి దాతలు సహకారించాలి

## శాసన సభ్యులు శ్రీ దాట్ల సుబ్బరాజు పిలుపు

### శాస్త్రోక్తంగా జీర్ణోదరణ -చరిత్రలో నిలిచిపోయేలా రాతి కట్టడం

**ముమ్మిడివరం సీజన్ టైమ్స్ మార్చి 20**

నియోజకవర్గంలోని ఐ పోలవరం మండలం మురమళ్ల గ్రామంలో నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి దాతలు, భక్తుల సహకారం ఎంతైనా ఉందని ఇతోధికంగా ఆర్థిక సహాయం అందించి ఆలయ పునః నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ముమ్మిడివరం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బారాజు పిలుపునిచ్చారు. పునః నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శైవాగమ పండితులు ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమంద్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో జీర్ణోదరణ, కళాన్యాస కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈకార్యక్రమానికి ముమ్మిడివరం శాసన సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత మహిమాన్వితమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ వీరేశ్వర వారి ఆలయం కొద్దీ పాటి వర్షాలకు ముంపునకు గురవుతొందన్నారు. ఆలయం లోతట్టు ప్రాంతంకావడంతో గర్భాలయం లోకి వర్షపు నీరు ప్రవేసిస్తోందని,స్వామి వారి ఆలయం పునః నిర్మాణం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నిర్మాణం నింమిత్తం ఇప్పటికే రు 4 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, చరిత్రలో నిలిచిపోయే ఈ ఆలయం పూర్తిగా రాతితో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు రు 12 కోట్ల రూపాయల వ్యయంతో అనుభవజ్ఞులై శిల్పితో నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణ సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనాలు, అభిషేకాలు ఏర్పాటు చేశామన్నారు. నిత్య



కల్యాణం యధావిధిగా జరుగుతుందన్నారు. నిర్మాణానికి ఇతోధికంగా దాతలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయాన్ని దేవస్థానం వాట్సప్ ఛానల్ ఉన్న 10 వేల మంది భక్తులకు శాసన సభ్యులు చేతులు మీదుగా మెసేజ్ రూపంలో సమాచారం అందించారు. తొలుత శాసన సభ్యులు దంపతులు స్వామిని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.కొబ్బరికాయ కొట్టి జీర్ణోదరణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ ధర్మకర్త మండలి సభ్యులు, మాజీ చైర్మన్ లు, సభ్యులు కాంట్రాక్టరు రవీంద్ర, భక్తులు, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీల తనిఖీ






**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 20**

జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, అమలాపురం లోని "రాజేశ్వరి హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ" ని తనిఖీ చేయడం జరిగింది, జిల్లా పౌర సరఫరాల అధికారి, అమలాపురం వారు "రాహుల్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ", రావులపాలెం నందున తనిఖీలు నిర్వహించడం జరిగినది.అంతేకాకుండా సహాయ పౌర సరఫరాల అధికారి ,పౌర సరఫరాల (డిప్యూటీ తహాశీల్దార్) వారు ఇరువురు కలిసి కిమ్స్ హాస్పిటల్స్ నందు కుకింగ్ జరుగు పరిస్థితులు పరిశీలించియున్నారు. తదుపరి జిల్లా పౌర సరఫరాల అధికారి, రావులపాలెం లో అనేక హోటల్స్ ను తనిఖీ చేసి చట్ట విరుద్దంగా వాడుతున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి వారిపై 6ఎ కేసు నమోదు చేసియున్నారు.గృహ అవసర సిలిండర్లను కృత్రిమ కొరత సృష్టించి దారి మళ్లించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా పౌయరా సరఫరాల అధికారి వారు హెచ్చరించియున్నారు.జిల్లా వ్యాప్తముగా పౌర సరఫరాల (డిప్యూటీ తహాశీల్దార్) లు టీం లు గా ఏర్పడి నిత్యం తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గృహ అవసర వినియోగదారులకి ఏ విధమైన ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా అనేది ప్రాధమిక పౌరసరఫరాల శాఖ కర్తవ్యయముగా దానికోసం తీసుకోవలసిన చర్యలు మొత్తం తీసుకోవడం జరిగిందని, పేనిక్ బుకింగ్ లేకుండా ఓటిపి సిస్టమ్ ద్వారా అర్బన్ ఏరియాలో అయితే 25 రోజుల తరవాత రూరల్ ఏరియాలో అయితే 45 రోజులు తరవాత గ్యాస్ సరఫరా చేయబడుతుందని ప్రభుత్వం వారు తెలియచేసియున్నారు. హాస్టలకు, స్కూల కు ,హాస్పిటల్స్ కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్యాస్ సరఫరా అయ్యే విధముగా చర్యలు తీసుకోవడం జరిగినది. రాష్ట్రం లోనే అత్యధిక నిత్య అన్నదానాలు చేసే ఆలయాలు డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 12 ఆలయాలు కలవు, వాటిన్నింటికి నిరంతరశీ అన్నదానశీ కొనసాగడానికి ప్రత్యామ్నాయ మార్గాల కొరకు సోమవారం మార్చి 23.న కలెక్టర్ కార్యాలయములో సదస్సు ఏర్పాటు చేయడం జరిగుతుందని, కాబట్టి నిత్య అన్నదాన సత్రాలకు గ్యాస్ ఒక్కదాని మీదే ఆదారం పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించి నిత్య అన్నదానశీ నిరంతరం జరిగే విధముగా చర్యలు జరుగుతుంది. ఈ రోజు జిల్లా మొత్తం మీద 14,076 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం జరిగినదని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏవిధమైన పిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు . ఈ కంట్రోల్ రూమ్ ప్రతిరోజూ ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00గంటలు వరకు కంట్రోల్ రూమ్ నెంబర్స్ 9493313862, 7306730640 పనిచేస్తాయని తెలిపారు.

## సిటిజన్ టైమ్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జె.సీ, డీపీఆర్వో





**కాకినాడ, బ్యూరో ఇంచార్జ్ సిటిజన్ టైమ్స్, మార్చ్ 20**

సిటిజన్ టైమ్స్ క్యాలెండర్ ను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మరియు జిల్లా సమాచార శాఖ పౌర సంబంధాల ఉపాధికారి ఆర్ వి ఎస్ రామచంద్ర రావు తమ తమ కార్యాలయాల్లో ఈరోజు ఉదయం ఆవిష్కరణ చేశారు.క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగ, వారు మాట్లాడుతూ వార్తలుసేకారణ లో సిటిజన్ టైమ్స్ దినపత్రిక ప్రత్యేకత కనబరుస్తుందనిఅని, ప్రజా సమస్యల పట్ల వార్తలు సేకరిస్తూ ప్రజలకు అధికారులకు మధ్య వారిదిగా ఉంటుందని అన్నారు.

# అమర జవాన్ స్మారక స్తూపము ఆవిష్కరణ లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల






**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

బేస్తవారిపేట జంక్షన్ ఆర్ కె నగర్‌లో ఏర్పాటు చేసిన అమర్ జవాన్ స్మారక స్తూపం ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు మాజీ సైనికులు ఎమ్మెల్యే కు సాగర స్వాగతం పలుకుతూ శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా అమర జవాన్లకు 2 నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం దేశ రక్షణలో సైనికులు చేసిన అపార సేవలు, వారి ప్రాణత్యాగాల ను వివరించారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని యువతకు మార్గ దర్శకమని తెలిపారు. సైనిక సేవలు, త్యాగాలు ఎనలేనివి అని నేడు మా ఈ స్వేచ్ఛా జీవితం యుద్ధం లో మీ ప్రాణత్యాగం, కష్టం ఫలితం అని స్థానిక నాయకుడిగా మీకు ఏ సమస్య, అవసరం వచ్చినా మీకు అన్ని వేళలా అందుబాటులో ఉండి మీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారులి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు పై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేస్తూ చిన్నారులను శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు.

# అడవిరాజుపాలెం హైస్కూలుకు ఎలక్ట్రికల్ బెల్ బహుకరణ


## జనసేనపార్టీ అధ్యక్షులు గిరిబాబుకు అభినందనలు



**గుడ్లూరు, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ అడవిరాజుపాలెం పాఠశాలకు గుడ్లూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు సన్నిశెట్టి గిరిబాబు ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఎలక్ట్రికల్ బెల్ ను శుక్రవారం పాఠశాల సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మనోహరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అవసరార్థం ఎలక్ట్రికల్ బెల్ బహుకరించి సహాయ సహకారాలు అందించిన మండల జనసేన పార్టీ అధ్యక్షులు గిరిబాబుకు, వారి సహచర సభ్యులకు పాఠశాల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షులు కొలకలూరి ఆమోసు, అక్కెలగుంట రంగసాయి, అక్కెలగుంట అశోక్, అక్కెలగుంట రాజేష్ టీడీపీ నాయకులు డీలర్ బొజ్జ వేణు, అడవిరాజుపాలెం హైస్కూలు విద్యాకమిటీ చైర్మన్ గుండ్లపల్లి శివాజీ, జి.రాజా (హెచ్ఎం), ఉపాధ్యాయ సిబ్బంది సిహెచ్ వసంత కుమారి, కె.వరలక్ష్మీ, పిగిలి మనోహరం, కె.సుధాకర్ రావు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ రేగులచెలక శాఖా కార్యదర్శి కలివెల థామస్ కోరారు. ఆమేరకు పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యకు శుక్రవారం అర్జీ అందజేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని, అలాగే ఎస్సీ కాలనీలో దక్షిణ వైపు ఉన్న కొన్ని గృహాల వారికి కొళాయిల నీరు రావడంలేదని ఆ ప్రాంతంలో ఓ బోరు వేసి మోటార్ బిగించడం ద్వారా అక్కడి ప్రజల నీటి సమస్య ను పరిష్కరించాలని, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ లైట్లు వేయించాలని, ఎస్సీల స్మశాన స్థలంలో చెట్లను తొలగించాలని, ఎస్సీల స్మశానం వరదనీటిలో మునిగిపోకుండా ఒకవైపు కాలువ తీసి నీటిని కిందకు మళ్లించే ఏర్పాటు చేయాలని ఆ అర్జీలో పేర్కొన్నారు.

# ప్రజా దర్బార్‌లో ప్రతి సమస్యకు పరిష్కారం

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు

**యర్రగొండపాలెం, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం లేదని, ప్రతి సమస్యకు ప్రజా దర్బార్ పరిష్కరిస్తుందని టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి ,వేగినాటి శ్రీనివాస్,మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్. సయ్యద్ అల్లా మాలిక్, సత్తార్,కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ముగిసిన రంజాన్ నెల ఉపవాసా దీక్షలు

**కొమరోలు, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులపాటు చేపట్టిన ఉపవాసా దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. గత నెల 18 తేదీన రంజాన్ నెల ప్రారంభమైంది. ఆ మరుసటి రోజు నుంచి ముస్లింలు పురుషులు, మహిళలు ,పిల్లలు ఉపవాస దీక్షలు చేపట్టారు. తెల్లవారుజామున 5 గంటల సమయానికి భోజన పానీయాలు ముగించుకొని(సహరీ) ఉపవాస దీక్షలో పాల్గొన్నారు. సాయంత్రం 6:30 లకు జరిగే ఇఫ్తార్ సమయం వరకు ఎలాంటి ఆహార పానీయాలు, పళ్ళు , మంచినీరు తదితర ఎలాంటి ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోకుండా ఐదు పూటల నమాజులు చేస్తూ కఠోర నియమాలతో ఉపవాసా దీక్షలు చేపట్టారు. పెద్దలతో పాటు పట్టుమని పది సంవత్సరాల వయస్సు కూడా నిండని బాల బాలికలు కూడా. తెల్లవారుజామున పెద్దలతో పాటు సహరీ చేసి ఉపవాస దీక్షలో పాల్గొన్నారు. గత నెల చివరి వారం నుంచి ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతూ వేసవి కాలాన్ని తలపిస్తూ వచ్చింది. అయినప్పటికీ పెద్దలు, మహిళలు, చిన్నారులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా 30 రోజులపాటు ఉపవాస దీక్షలను కొనసాగించారు. ఉపవాసా దీక్షలు చేపట్టిన ఉపవాసపరులకు పలువురు దాతలు సహరి ,ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి అల్లా కృపకు పాత్రులయ్యారు. శుక్రవారం రంజాన్ మాసం ముగిసి షవ్వాల్ మాసపు నెలవంక కనిపించడంతో ఉపాసాదీక్షాపరులు



తమ 30 రోజుల పాటు కొనసాగిన ఉపవాస దీక్షలను విరమించారు. చివరి రోజైన శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ సమయంలో మసీదులు ఉపవాసా దీక్షపరులతో నిండిపోయాయి .30 రోజులపాటు కఠోర నియమాలతో ఉపాసదీక్షలు చేపట్టిన దీక్షాపరులను పలువురు అభినందించారు. శుక్రవారం సాయంత్రం షవ్వాల్ నెలవంక కనిపించడంతో శనివారం రంజాన్ పర్వదినం (ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని ) జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు. దీనితో ముస్లింలు ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకునేందుకు ఏర్పాటులో మునిగిపోయారు.

# జిల్లా క్రీస్తు సంఘముల అధ్యక్షుడిగా చాట్ల గంగయ్య ఎన్నిక ఏకగ్రీవం




**పెద్ద దోర్నాల, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

పట్టణంలో హవేలీ ఫంక్షన్ హాల్ నందు మార్కాపురం జిల్లా క్రీస్తు సంఘముల ఐక్యవేదిక చారిటబుల్ ట్రస్టు మీటింగ్ శుక్రవారం నిర్వహించారు జరిగినది, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీస్తు



సంఘముల సువార్తికులు సుమారుగా 150 మంది హాజరై జిల్లా క్రీస్తు సంఘముల నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు: చాట్ల గంగయ్య వర్కింగ్ ప్రెసిడెంట్: సింగ రాజేష్, ఉపాధ్యక్షులు గొంగటి ఏలియా, దర్శనం సుధీర్ బాబు, గుర్రం బాబు, కార్యదర్శులు: ముటుకూరి దేవదానం, వేశపోగు భరత్, ఎనిబెర అచ్చయ్య, గుర్రం శరత్ బాబు, కోశాధికారి: బూదాల అశోక్ కుమార్, ఈసీ మెంబర్స్: పల్లె బాబు, దర్శి షాలెం రాజు, ఇంటూరి జయరాజు, పుప్పాల డేవిడ్, గౌరవ అధ్యక్షులు: వంకాయలపాటి జర్మియ, చిలకా ఇశ్రాయేలు, రావినూతల సుధాకర్ రావు, వేశపోగు బాలు, దర్శనం పెద్ద యేసయ్య, గౌరవ సలహాదారులు: కొంగలేటి సొలోమన్ రాజు, సన్నెపోగు సుందర్ రాజు, వంకాయలపాటి డేవిడ్ రాజు, గంగవరపు డేవిడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఆపదవేళ ఆపన్న హస్తం -ముఖ్యమంత్రి సహాయ నిధి

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు

**యర్రగొండపాలెం**
**సిటిజన్ టైమ్స్ మార్చి 20**

పరిస్థితుల వల్ల వివిధ రోగాల బారినపడి ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తమని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 18 మంది కి 11లక్షల 90వేల 333రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణి చేసారు.వివిధ రకాలైన ఆరోగ్య సమస్యలతో ప్రవేటు వైద్యశాల లో చికిత్స లు పొందిన వీరు, ఎరిక్షన్ బాబు కలిసి చికిత్స కు సంబంధించిన వివరాలు అందించి సహాయం కోరడంతో ఆయన వీరందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చేసారు. దీంతో లబ్ధిదారులు చంద్రబాబు నాయుడుకు , ఎరిక్షన్ బాబుకు




కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలొ మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీనివాస్, తోట మహేష్ నాయుడు, మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కదిరి

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని కనిగిరి నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులందరికీ మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్సీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు ఈద్ ముబారక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా కృప కటాక్షలతో రంజాన్ పండుగ ప్రతి ఒక్క ముస్లిం కుటుంబాలలో వెలుగు నింపాలని ఆకాంక్షించారు రంజాన్ మాసం ఆధ్యాత్మికతకు, సామరస్యానికి,



సుహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి, కరుణకు దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దాన ధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ, పేదలకు సహాయం చేయడం, పరస్పరం ప్రేమాభిమానాలు, సమాజంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొనాలని, ప్రజల సుఖ సంతోషాలతో, సకల శుభాలు కలగాలని, ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నెలకొనాలని కోరుకుంటూ రంజాన్ పండుగను ముస్లిం సోదరి సోదరీమణులు అందరూ పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు కలిసికట్టుగా ఐక్యమత్యంగా రంజాన్ పండుగ చేసుకొని అల్లాహు దయ కృప కటాక్షాలు పొందాలని కదిరి బాబురావు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రంజాన్ పండుగ శుభాకాంక్షలు

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

ముస్లిం సోదర సోదరీమణులకు స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని అన్నారు. ఈద్ పండుగ మీ ఇంటికి కొత్త వెలుగులు తీసుకురావాలని, అల్లాహ్ దీవెనలతో మీ ఇంట ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలి అని ఆకాంక్షించారు. రంజాన్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

ముస్లిం సోదర, సోదరీ మణులందరికీ రంజాన్ పండుగ సందర్భంగా వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అల్లా కృప కటాక్షాలతో ఈ రంజాన్ పండుగ ప్రతి ఒక్క ముస్లిం కుటుంబాలలో వెలుగులు నింపాలని అభిలసించారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరి అభివృద్ధికి



తోడ్పడిందని పేర్కొన్నారు.వైసిపి ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేసిందని తెలిపారు.ప్రతి ఒక్క ముస్లిం కుటుంబ సమేతంగా ఆనందకరమైన వాతావరణంలో రంజాన్ పండుగ చేసుకొని అల్లాహ్ దయ కృపా కటాక్షాలు పొందాలని అయన ఆకాంక్షించారు.

# మండల ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**పెద్ద దోర్నాల, సిటిజన్ టైమ్స్ మార్చి 20**



పెద్ద దోర్నాల మండల లోని ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రంజాన్ పండుగ సందర్భంగా వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఘంటా వెంకట రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.అల్లా కృప కటాక్షాలతో ఈ రంజాన్ పండుగ ప్రతి ఒక్క ముస్లిం కుటుంబాలలో వెలుగులు నింపాలని అభిలసించారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరి అభివృద్ధికి తోడ్పడిందని పేర్కొన్నారు.ప్రతి ఒక్క ముస్లిం కుటుంబ సమేతంగా ఆనందకరమైన వాతావరణంలో రంజాన్ పండుగ చేసుకొని అల్లాహ్ దయ కృపా కటాక్షాలు పొందాలని అయన ఆకాంక్షించారు.

# రైల్ ఢీ కొని వ్యక్తి మృతి


**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ మార్చి 20**

గిద్దలూరు రైల్వే స్టేషన్ పరిధిలో స్టేషన్ తూర్పు వైపున ప్లాట్‌ఫామ్ దాటే క్రమంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్లబండ బజార్‌కు చెందిన షేక్ మహమ్మద్ దౌలతు గా గుర్తించారు. ఆయన రాచర్ల విద్యుత్ శాఖ కార్యాలయంలో లైన్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అనారోగ్యం, పక్షవాతం సమస్యల కారణంగా ఇటీవల మెడికల్ లీవ్‌లో ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ పరిస్థితుల్లోనే ఆయన బయటకు వెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందడంతో భార్యా పిల్లలు ఆర్తనాదాలతో విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న స్థానిక రైల్వే పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.






# ప్రభాస్- హోంబలే డీల్.. ఆ ఇద్దరు డైరెక్టర్స్ ఎవరు?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మధ్య ఇటీవల కుదిరిన భారీ డీల్.. ఇప్పటికే సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరి కాంబినేషన్ లో వచ్చిన సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్ భారీ విజయాన్ని సాధించింది. ఆ సక్సెస్ తో ప్రభాస్– హోంబలే ఫిల్మ్స్ కాంబోపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అంతే కాదు ఆ మూడు సినిమాల డీల్ అందరి దృష్టిని ఆకర్షించింది.అయితే ఆ డీల్ లో భాగంగా ఇప్పటికే ఒక సినిమా ఫిక్స్ అయింది. అదే సలార్: పార్ట్ 2 శౌర్యంగ పర్వం. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సలార్ ఫస్ట్ పార్ట్.. పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ రెస్పాన్స్ అందుకుంది. యాక్షన్ ఎలిమెంట్స్, స్టోరీ, ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎలివేషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, సలార్ 2 త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఆ సినిమాను హోంబలే ఫిల్మ్స్ భారీ స్థాయిలో నిర్మించనుంది. అయితే ప్రభాస్ తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా మిగిలిన రెండు సినిమాలు ఏమిటన్నది ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఆ మూవీలు.. ప్రభాస్ ఏ డైరెక్టర్స్ తో చేయనున్నారోనని ఇప్పటికీ క్వశ్చన్ మార్క్.అయితే ఆ రెండు ప్రాజెక్టులు ఇద్దరు యువ దర్శకులతో ఉండొచ్చనే వార్తలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఆ దర్శకుల్లో ఒకరు మలయాళ డైరెక్టర్ దింజిత్ అయ్యథాన్ అని టాక్ వినిపిస్తోంది. ఆయన కిష్కింధ కాండ, ఏకో సినిమాలతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల దింజిత్ ప్రభాస్ ను కలిసి కథ వినిపించినట్లు తెలుస్తోంది. డార్లింగ్ ఇమేజ్ కు తగ్గట్లు దింజిత్ ఆ స్టోరీ రాసుకున్నారని టాక్. అదే సమయంలో మరో దర్శకుడు కూడా డార్లింగ్ కు ఇటీవల ఓ కథ వినిపించినట్లు సమాచారం. కోలీవుడ్ దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి ఇటీవల ప్రభాస్ ను కలిసి న ట్లు వార్తలు వినిపిస్తున్నా యి. రాజ్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన అమరన్ మంచి విజయాన్ని అందుకోవ డంతో ఆయ న కథపై కూడా ఆసక్తి నెలకొంది. అయితే ఆ రెండు కథలు విన్న ప్రభాస్.. ఇంకా ఫైనల్ డెసిషన్ తీసుకోలేదని తెలుస్తోంది.ప్రస్తుతం ప్రభాస్ చేతిలో పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి మధ్య హోంబలే ఫిల్మ్స్ తో ఉన్న మూడు చిత్రాల ఒప్పందం స్పెషల్ ఇంపార్టెన్స్ దక్కించుకుంది. ముఖ్యంగా సలార్ 2 ఇప్పటికే ఖరారవ్వడంతో మిగిలిన రెండు సినిమాలు ఏవో అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. దింజిత్ అయ్యథాన్, రాజ్ కుమార్ పెరియస్వామి చెప్పిన కథలలో ఏది ఫైనల్ అవుతుందో లేదా మరో కొత్త దర్శకుడితో సినిమా ప్రకటిస్తారా అన్నది త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ఆ ప్రాజెక్టులపై చర్చ కొనసాగుతూనే ఉంటుంది.




# వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా బీసీసీఐ మాస్టర్ ప్లాన్.. ఐపీఎల్‌పై సెలక్టర్ల కన్ను




వన్డే ప్రపంచకప్ 2027 టోర్నమెంట్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ మెగా టోర్నీ కోసం సుమారు 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్ జాబితాను సెలక్టర్లు ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా గమనించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పీటీఐ ఒక కథనంలో పేర్కొంది.సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ప్రగ్యాన్ ఓఝా.. ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా స్టేడియాల్లోనూ, టీవీల్లోనూ పర్యవేక్షించనున్నారు. ప్రతీ వారం కనీసం ఐదు మ్యాచ్‌లను కవర్ చేసేలా, ఒక్కో సెలక్టర్ ఒక్కో మ్యాచ్‌కు హాజరయ్యేలా ప్రణాళిక రచించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ పర్యవేక్షణ కేవలం వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని మాత్రమే జరుగుతుందని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ లేదా టీ20 ప్రపంచకప్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టమైంది.


సెలక్టర్లు ప్రధానంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లపై దృష్టి సారించనున్నారు. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న హర్షిత్ రాణాకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.మరోవైపు జూన్ 6 నుంచి 10 వరకు ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు పూర్తిస్థాయి జట్టును పంపాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు లేనప్పటికీ, దీనిని తేలిగ్గా తీసుకోవడం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు భారత్ తొమ్మిది టెస్టులు ఆడాల్సి ఉన్నందున, ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో గాయపడకపోతే బుమ్రా, సిరాజ్ కూడా ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టు ఆడే జట్టులో ఉంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. “భారత టెస్టు జట్టు ప్రయోగాలకు వేదిక కాదు. దానికోసం ఇండియా–ఏ పర్యటనలు ఉన్నాయి. ప్రస్తుతం టెస్టుల్లో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ మా మొదటి ప్రాధాన్యత” అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

# క్రికెట్‌పై ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం సెగ.. ఇంగ్లాండ్‌లో బంతుల కొరత




మధ్య ప్రాచ్యంలో ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య నడుస్తున్న యుద్ధం అంతర్జాతీయ క్రికెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ యుద్ధం వలన ముఖ్యంగా ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగే కౌంటీ క్రికెట్ సీజన్‌కి సెగ తగిలింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్‌కు ముందు ఈ సమస్య తలెత్తింది. ఈ టోర్నీలో ఉపయోగించే ప్రముఖ డ్యూక్స్ బంతుల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడింది. సాధారణంగా ప్రతి క్లబ్‌కు సరిపడా నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 50 శాతం మాత్రమే ఇంగ్లాండ్ బోర్డు దగ్గర అందుబాటులో ఉన్నాయి.ఈ డ్యూక్స్ బంతులు ప్రధానంగా భారత్, పాకిస్తాన్ లాంటి దక్షిణాసియా దేశాల్లో తయారవుతాయి. అయితే మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభంతో ఈ బంతులను ఇంగ్లాండ్‌కు రవాణా చేయడంలో పెద్ద ఎత్తున జాప్యం కొనసాగుతుంది. ఫ్యాక్టరీల్లో బంతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, వాటిని ఎక్స్ పోర్టు చేయడానికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిపై బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ యజమాని దిలీప్ జజోడియా మాట్లాడుతూ.. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల మేము పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం.. ఈ సీజన్ ప్రారంభానికి క్లబ్‌లకు కేవలం 50 శాతం బంతులనే ఇవ్వగలుగుతున్నాం.. మిగిలినవి తర్వాత అందించాల్సి వస్తోందని వెల్లడించారు. అంతేకాదు, విమానయాన సంస్థలు సరుకు రవాణా చేసేందుకు ముందుకు రావడం లేదని, రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయని బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ యజమాని దిలీప్ జజోడియా పేర్కొన్నారు. సాధారణంగా ఒక బాక్స్‌కు కిలోకు 5 డాలర్లు వసూలు చేసేవారు. కానీ ప్రస్తుతం అదే ధర 15 డాలర్లకు పెరిగిపోయింది అన్నారు. ఈ సంక్షోభం మరింత తీవ్రంగా మారితే, ప్రత్యామ్నాయంగా ఆస్ట్రేలియాకు చెందిన కూకబుర్రా బంతులను ఉపయోగించాల్సిన పరిస్థితి రావొచ్చని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు.

# సీఎస్కే ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎంఎస్ ధోనీకి దక్కని చోటు.. ఇర్ఫాన్ పఠాన్ ఏమన్నారంటే?




మరో వారం రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిసన్ ప్రారంభం కానుంది. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ప్రస్తుత బ్యాటింగ్ శైలిని విశ్లేషిస్తూ, పఠాన్ తనదైన శైలిలో కామెంట్స్ చేశాడు. ఈ సందర్భంగా సీఎస్‌కే అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో ధోనీకి చోటు దక్కడం కష్టమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంఎస్ ధోనీ గత కొన్ని సీజన్లుగా బ్యాటింగ్ చేసేందుకు లోయర్ ఆర్డర్ లో 7, 8 స్థానాల్లోనే వస్తున్నాడు. కేవలం ఒకటి లేదా రెండు ఓవర్లు మాత్రమే ఆడుతున్నారని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నారు. ధోనీ కేవలం రెండు ఓవర్లు ఆడటం ఆయన అభిమానులకు ఆనందాన్ని ఇవ్వవచ్చు కానీ, జట్టుకు మాత్రం పెద్దగా ఉపయోగపడదని తేల్చి చెప్పాడు. ఆయన ఆడాలనుకుంటే కనీసం నాలుగు ఓవర్లు బ్యాటింగ్ చేయాలి.. లేదంటే ఆ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించడం జట్టుకు మేలు చేస్తుంది అని పఠాన్ సూచించారు. గత ఐదు సీజన్లలో ఎంఎస్ ధోనీ ఎదుర్కొన్న బంతుల సంఖ్యను పరిశీలిస్తే అతడి బ్యాటింగ్ టైమింగ్ పూర్తిగా తగ్గుతూ వస్తోంది. గత 5 సీజన్లలో సగటున సీజన్‌కు 114 బంతులను మాత్రమే ఎదుర్కొన్నారు. ‘ఇంపాక్ట్ ప్లేయర్’ రూల్ వల్ల ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు రావడం సులభమైంది, అయితే ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్ అయినా ఏదో ఒక సమయంలో రిటైర్మెంట్ ఇవ్వాల్సిందేనని భారత జట్టు మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ గుర్తు చేశారు.

**ఇర్ఫాన్ పఠాన్ ఎంచుకున్న ‘సీఎస్‌కే 12’:**

సంజు శాంసన్, ఆయుష్ మ్హాత్రే, రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), శివం దూబే,డెవాల్డ్ బ్రెవిస్ సర్ఫరాజ్ ఖాన్, కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్, అఖీల్ హొసేన్, మాట్ హెన్రీ,నూర్ అహ్మద్ ఖలీల్ అహ్మద్ (ఇంపాక్ట్ ప్లేయర్),

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776